క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు పి.జనార్దనరావు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శనివారం ఆయన ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వైద్యుడి మృతికి గల కారణాలు తెలుసుకుని, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



రాజాం: చలివేంద్రం వద్ద నీరు తాగుతున్న ప్రయాణీకులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ ప్రధాన రోడ్డులోని సత్యసాయి మందిరం వద్ద శనివారం చలివేంద్రం ప్రారంభించారు. అటువైపుగా వచ్చే వారికి సత్యసాయి భక్తులు తాగునీరు అందజేశారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కాలేజీ రోడ్డులో బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, డీఎస్పీ బి.మోహనరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు చేతులమీదుగా శనివారం ప్రారంభించారు.

హద్దురాళ్ల ఏర్పాటును వేగవంతం చేయండి



గ్రామాలకు తరలిస్తున్న హద్దురాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

టెక్కలి: హద్దురాళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు జరగనున్న నేపథ్యంలో రాళ్లు తరలించే ఏర్పాట్లను ఆయన మండల కేంద్రంలో శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెలగవలస, కొరటాం, కూనాయవలస సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సరిహద్దుల గుర్తింపు పూర్తయిందని, ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు చురుగ్గా జరుగుతోందన్నారు.

చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస గ్రామంలో మంగలాకారి చెరువు అభివృద్ధి పనులకు మాజీ వైస్ ఎంపీపీ గంద్రేటి కేసరి శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా చెరువును బాగుచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ త్రినాధరావు, ఈసీ మురళీ, టీఏ వెంకటరమణ, సర్పంచ్ గంద్రేటి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

టెక్కలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. మండలంలోని రంగప్పవలస గ్రామంలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా కొన్నాళ్ల క్రితం అక్కడి చెరువు గట్టుపై నాటిన కొబ్బరి మొక్కలను శనివారం పరిశీలించారు. ప్రతిరోజూ వీటికి నీరు పోసి, సంరక్షణ కూడా చూసుకుంటున్నామన్నారు. వీటి ఫలసాయం ద్వారా రానున్న రోజుల్లో పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి, పెంచాలని తద్వారా గ్లోబల్ వార్మింగ్, భూ కాలుష్యం తగ్గి ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

బొబ్బిలి: ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని సీఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. మండలంలోని మల్లంపేట, ఎం.బూర్జవలస గ్రామాల్లో గ్రామదేవతల పండగ పురస్కరించుకుని, పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఆయా గ్రామాల పెద్దలతో శనివారం సమావేశమైన ఆయన పండగ రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం పండగ ఏర్పాట్లు, భద్రతకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

దాతల సహకారంతో సీసీ రోడ్డు, బారికేడ్లు

టెక్కలి: దాతల సహకారంతో మండలంలోని కొరటాం గ్రామ శ్రీకోటిలింగేశ్వరస్వామి ఆలయానికి సీసీ రోడ్డు వేయడంతో పాటు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, టెక్కలి, బలిజిపేట మండలాలకు చెందిన పలువురు దాతలు లక్ష రూపాయల వరకు విరాళం అందజేయగా, ఆ నిధులతో ఆలయ ముందు భాగంలో సీసీ రోడ్డు, ఇనుపరాడ్లతో బారికేడ్లు ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు గుల్లిపల్లి సుధ శనివారం తెలిపారు.

జనం నోట జై జగనన్న మాట



రేగిడి: ఉంగరాడలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న గ్రామస్తులు



టెక్కలి: లోచర్లలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ ప్రచారం



రామభద్రపురం దిగువహరిజన వీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం: పుచ్చలవీధిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



వంగర: వంగరలో గృహసారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



వంగర: కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



రాజాం సిటీ: దోసరిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ ప్రచారం చేస్తున్న గృహసారథులు

జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అన్నిచోట్ల అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై.. వైఎస్సార్ సీపీ.. జయహో.. జగన్ నినాదాలతో పార్టీ శ్రేణులకు జనం సాదర స్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: కావలిలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న సర్పంచ్ రవీంద్ర, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

ప్రజల సంక్షేమమే పార్టీ అజెండా



సంతకవిటి మండల వైఎస్సార్ సీపీ నేతలతో సమీక్షిస్తున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డి

- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

రాజాం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కంచరాం సమీపంలో ఉన్న తృప్తి రిసార్ట్‌లో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం నియోజకవర్గ పరిశీలకుడు పేరాడ తిలక్‌లతో కలిసి, మండలాల వారీగా పార్టీ అభివృద్ధి, జగనన్న పాలనపై సమీక్షించారు. ఎన్నికలకు మరో ఏడాది ఉన్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో వికాస తరంగిణి సాంస్కృతిక సంస్థ, ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సకల జీవరాశులకు ఆధారమైన భూమిని కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రసాయన ఎరువులు, ప్లాస్టిక్ వాడకం తగ్గించి, నేలతల్లిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, హిందూ చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ చెలికాని కేశవ, వికాస తరంగిణి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బదరీ నారాయణ, శివప్రసాద్ పాణిగ్రాహి, బ్రహ్మకుమారీ బీకే రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భూ కాలుష్యం నివారణపై అవగాహన కల్పిస్తున్న వికాస తరంగిణి సాంస్కృతిక సంస్థ సభ్యులు

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



దివ్యాంగునికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిమ్మలపాడు, కొయ్యకొండవలస గిరిజన గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయనకు థింసా గిరిజన నృత్యంతో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ఆయన అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు వలంటీర్లే ఇంటింటికీ వచ్చి, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సర్పంచ్ వెలంగిణి, మాజీ సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక 'రంజాన్'



బొబ్బిలి: రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



రేగిడి: తాటిపాడులో రంజాన్ ప్రార్థనలు



రాజాం: కొత్తవలసలో షేక్ సలీమ్ కుటుంబాన్ని సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు తిరుమలరావు

శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలంతా ఉదయం నుంచే వరకు మసీదులకు చేరుకుని, ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అందరూ సుఖసంతోషాలతో జీవించేలా కరుణించాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. పవిత్ర ఖురాన్ బోధనలు సదా అనుసరిస్తూ సన్మార్గంలో నడవాలని, ఇదే పవిత్ర రంజాన్ సర్వమానవాళికి ఇచ్చే శుభసందేశమన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఈద్ ముబారక్(పండగ శుభాకాంక్షలు) చెప్పుకున్నారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బాడంగి: ఖురాన్ బోధనల సారాంశం వివరిస్తున్న ముస్లిం మత పెద్ద ఇమామ్



రామభద్రపురంలో రంజాన్ వేడుకల్లో ముస్లిం సోదరులు


నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష



బెంచీలపై హాల్‌టికెట్ల నంబర్లు వేయిస్తున్న సిబ్బంది

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు తెలిపారు. శనివారం కేంద్రంలో పరీక్షకు సంబంధించి, ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ఐదో తరగతిలో ప్రవేశానికి 279 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 163 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ అభ్యర్థులకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రాసే వారంతా అరగంట ముందే హాల్‌టికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటో, పెన్ను, పెన్సిల్, వాటర్‌బాటిల్‌తో హాజరు కావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



బాడంగి: మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనీ శ్రీనివాసరావు

సంతకవిటి: మండలంలోని మామిడపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. తొలుత ప్రకృతి వ్యవసాయానికి 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ప్రణాళికలు రూపొందించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ శారద మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్ల రేవతి, ఎల్‌టీ సరస్వతి, ఐసీఆర్‌పీ పి.అన్నంనాయుడు, ఎస్.భారతి, కృష్ణవేణి, సీఎఫ్‌లు రమ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఖరీఫ్ సాగు–2023–24కు సంబంధించి, ప్రణాళికలు రూపొందించారు. మాస్టర్ ట్రైనీ రొంగలి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుందని, అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పొలాల్లో నవధాన్యాలు చల్లుకుంటే నేల సారం పెరుగుతుందన్నారు. తద్వారా పంటకు చీడపీడలు పట్టవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భోగి జ్యోతి, కార్యదర్శి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం..



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన రక్తదాతల నుంచి 48 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదే కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ బి.మోహనరావు మాట్లాడుతూ ఒకరు దానం చేసిన రక్తం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోస్తుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్న అపోహలు వీడాలన్నారు. రక్తదానానికి విద్యార్థులు, యువతీయువకులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ పి.రమాదేవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పొగిరి గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపాలని, ఈ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖరీఫ్‌కు ముందు ఉండే పొడి వాతావరణంలో 30 రకాల విత్తనాలు ఎకరానికి 13 కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గించడంతో పాటు చీడపీడల నుంచి పంటను కాపాడవచ్చన్నారు. అలాగే నేల సారవంతమై, నీటి కొరత నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెంది, ప్రధాన పంటకు తోడ్పాటునందిస్తాయన్నారు. ప్రతీ రైతు భరోసా కేంద్రంలో ఈ నెల 23 నుంచి నవధాన్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. 13 కిలోల ప్యాకెట్ రూ. 800లకే సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు పి.వెంకటరమణ, పి.భారతి, వై.నిర్మల, పార్టీ నాయకులు పొగిరి లెనిన్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు ముందు నవధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతమై తద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

వంగర: ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ పాలనను నిరసిస్తూ మండల కేంద్రంలో ప్రచార భేరి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీల నేతలు పి.విశ్వనాథ్, ఎం.త్రినాథ్, వి.తిరుపతిరావు, సుమన్, రమేష్ మాట్లాడుతూ మోదీ సర్కారు కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములు పెద్దల చేతుల్లోకి మారిపోతున్నాయని ఆరోపించారు. నోట్ల రద్దు దగ్గర నుంచి జీఎస్‌టీ అమలు, వ్యవసాయ చట్టాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం వంటివి అన్నీ ప్రజావ్యతిరేక విధానాలేనన్నారు.